## కామెడీ కథ

నందుల వెంకటేశ్వరరావు

# కోడలు మహాలక్ష్మి-అత్త సుబ్బలక్ష్మి

**కాకులు కూస్తున్నా, కోళ్లు కొక్కరోకో అంటున్నా అత్త సుబ్బలక్ష్మికి మాత్రం తొమ్మిది దాటితేనేగాని తెల్లారదు. తల్లి బాలమాణిక్యాంబ పెంపకం మరి.**

**ఆసరికి శంభు శాస్త్రి కుంపటి వెలిగించి అక్కడే తారట్లాడుతుంటాడు. గ్యాస్ పొయ్యి మీద ఏంచేసినా సుబ్బలక్ష్మికి పడదు. కడుపులో గ్యాస్ తంతుంది అంటుంది.**

లేచిన దగ్గర్నుంచి ఏదో ఒక తీరున నలతగా ఉంటుంది. ఒకరోజు ఒళ్లు నొప్పులైతే ఇంకోరోజు ఛాతిలో మంట. ఒకరోజు శిరోభారం అయితే ఇంకో రోజు కాళ్ళు పీకుడు. మరోరోజు దిక్కుమాలిన ఆయాసం.

పాచినోటితో బెడ్ కాఫీ తాగి, కాస్త గుండెదడ తగ్గిన తర్వాత పళ్లు తోముకుని, వేడి ఇడ్లీ రెండు వాయలు తిని మళ్ళీ సోలెడు కాఫీ తాగిన మరు నిముషమే కాలి బొటన వ్రేలి దగ్గర్నుంచి నీరసం ఎగదన్ని 'అమ్మా' అంటూ మంచం మీద వాలిపోతుంది సుబ్బలక్ష్మి. ఆవిడకు వైద్యం చెయ్యలేక ముగ్గురు డాక్టర్లు బోర్డు పీక్కుని వెళ్లిపోయారు. సింపుల్‌గా చెప్పాలంటే సుబ్బలక్ష్మికి తినకపోతే నీరసం తింటే ఆయాసం.

"ఈ నీళ్ల కాఫీ త్రాగితే నా ఒంట్లో బలం ఏముంటుంది. మీరా పాలవాడ్ని కేకలెయ్యరు. లీటరు కాఫీ తాగినా మరుక్షణం బలం ఆవిరై పోతుంది. పాలు చిక్కగా ఉంటేనే కదా బలం" సుబ్బలక్ష్మి సన్నాయి నొక్కుల్లకు శంభుశాస్త్రి మండిపడేవాడు.

"పాలు చిక్కన కాదే. ప్రతి అరగంటకీ, గంటకీ కేజీ తక్కువ కాకుండా కడుపులో వేస్తున్నావు. కాస్త కాలు ఝాడించి రెండడుగులు వేస్తేనే కదా తిన్నది అరిగేది, వంట పట్టేది"

"చాల్లెండి. ఎప్పుడూ నా తిండినే ఆడిపోసుకున్నారు. ఏం ఎక్కువ తింటున్నానని? పది పెసరట్లు తినలేను. కేజి ఉప్మా చేస్తే ముగ్గురం తింటున్నాం. అడ్డెడు గిన్నె వారిస్తే మనం తినగా పని మనిషికి కూడా మిగులుతోంది...లేస్తే కళ్లు తిరుగుతాయి. కూచుంటే కాళ్లు కదుములు కడుతున్నాయి. ఏం జబ్బో గుండె నీర్సం. ఇదేమైనా కాన్సర్రో, లివర్రో, కిడ్నీల జబ్బో. ఏ డాక్టరుకీ నా రోగం అంతు పట్టదు. తిన్నదంతా నీరైపోతుంది.. అసలు మిమ్మల్నానాలి. ఏ నాడైనా జిహ్వాకు రుచిగా, ఒక కూర గాని, పచ్చడి గాని చేసి పెట్టారా. మీకే శ్రద్ధ లేకపోతే ఆ డాక్టర్లకేం ఉంటుంది. నా కర్మగాకపోతే ఆ సూరిపండును చేసుకున్నా పోవును రాజయోగంలాగా" సూరి పండు ఆవిడ పెళ్లి చూపుల్లో ధిక్కరించిన మూడో వరుడు. బ్రాహ్మణార్థాలు చేసుకుంటూ ఆవిడ పుట్టిన ఊళ్లో సెటిలైన ఆవిడ చిన్నప్పటి హీరో.

పెళ్లయిన మర్నాడు అత్తవారింట్లో కాఫీ పెట్టింది సుబ్బలక్ష్మి. ఆపైన ఇంటిల్లిపాదికీ వారం రోజులు వాంతులూ, విరోచనాలూ. ఏదైనా కలరా సోకిందేమోనని అందరూ కంగారు పడ్డారు. ఆ తర్వాత అది కాఫీ ప్రయోగం అని తెలిసి నెమ్మదించారు.

అదిగో అప్పట్నుంచీ ఆఫీసు పనితోపాటు అత్తెసరు పనికి కూడా శ్రీకారం చుట్టాడు శంభుశాస్త్రి.

ooo

"మీతో దెబ్బలాడటానికి నాకు ఓపిక లేదుగానీ ఈ పూట మామిడికాయ పప్పులో వేసి, ముప్వంకాయలు ఉల్లి కారంపెట్టి వండండి. కక్కుర్తిపడకుండా వెల్లుల్లి పాయలు బాగా పోపులో వేయండి. మామిడికాయ పప్పుకి, వడియాలు, ఊరుబిండి మిరపకాయలు వేయించండి. మామిడికాయ పప్పులో పచ్చికారం తగలెట్టకుండా వేపుడు కారం అదే దనియాల కారం తగలెట్టండి. మీ చేత అన్నీ చేయిస్తున్నాను. నేను తప్పనిసరిగా నరకానికే తగలడతాను. అక్కడ మీ అమ్మా నాన్నా బంధువులందరినీ మీరు అడిగారని చెబుతాన్లెండి. మీరు స్వర్గానికే వెళతారు. నాకు తెలుసు. అక్కడ మా అమ్మా నాన్న, బంధువులు కనపడతారు. అందర్నీ అడిగానని చెప్పండి. నేను మరి కాసేపు పడుకుని జెమినిలో 'అంజలి' వచ్చేసరికి లేస్తాను. లేకపోతే నన్ను లేపండి. ఆపైన రెండు చెంబులు నీళ్లు పోసుకుని, మీ అనాచారం వంటకు రెండు ఉద్ధరిణల నీళ్ళు చిలకరించి దేవుడికి నైవేద్యం చూపిస్తాను. అవునూ... మొన్న ఆ బ్రెయిన్ ట్యూమర్ లక్షణాలు కనుక్కోమన్నాను కనుక్కున్నారా? నాకు బ్రెయిన్ ట్యూమరేమోనని అనుమానంగా ఉంది" సుబ్బలక్ష్మి స్వరం ధాటిగా సాగుతూనే ఉన్నట్లుండి గుర్రులోకి జారిపోయింది.

"ఆ కనుక్కున్నాను" కసిగా అన్నాడు శంభుశాస్త్రి. "అది బ్రెయిన్ ఉన్నవాళ్లకు వస్తుందిట. నీకు వచ్చే అవకాశమే లేదన్నారు డాక్టరుగారు" ఇంకా ఏదో చెప్పబోతూ గుర్రుపెడుతున్న సుబ్బలక్ష్మిని చూసి పళ్లు పటపటలాడించాడు శంభుశాస్త్రి.

ooo

"మన రెండో వాడి పెళ్లి చేసెయ్యండి. చూసి వెళ్లిపోతాను అని ఎన్నిసార్లు చెప్పాను. మీకసలు శ్రద్ధే లేదు. ఆ కాకినాడ దగ్గర పల్లెటూరు సంబంధం వాళ్లు పిల్ల ఫోటో, జాతకం ఇచ్చి ఎంతకాలం అయింది. జాతకాలు చూపించారా? ఏమిటి ఆలస్యం?" మండిపడసాగింది సుబ్బలక్ష్మి.

"ఆలస్యం ఏమీ లేదు. వచ్చే శనివారం పెళ్లిచూపులకు వెళదాం. పెళ్లి చూసి వెళ్లిపోతానంటున్నావు గదా. మళ్ళీ నువ్వెళ్ళిపోతే ఇంతమందిమి మాకెలాగా అని ఆలోచిస్తున్నాం. మాకు నువ్వే పెద్ద దిక్కువుగదా" జోకేశాడు శంభుశాస్త్రి.

"ఓ నా జన్మ తరించిపోతోంది నా మీద మీ ప్రేమకి" నిరసనగా మూతి ముడిచింది సుబ్బలక్ష్మి.

శంభుశాస్త్రి, సుబ్బలక్ష్మి దంపతులకు జోగినాథం రెండో సంతానం. ఐ.టీ. ఇంజనీరు కావడం మూలాన అమిత మేధతో పాతికేళ్లకే బట్టతలయి, బట్టతలవాళ్ల హెయిర్‌స్టయిల్ (గుండు) అలవాటు చేసుకున్నాడు. నెత్తి మీద జుట్టు ఉన్నప్పుడు అతను కొన్ని సంబంధాలు నచ్చలేదని తిరస్కరించాడు. ఇప్పుడు ఆడపిల్లలు తక్కువ కావడం, వాళ్ళు కూడా చదువుకోవడం, వాళ్ళకీ అభిరుచులు ఏర్పడటంతో బట్టతలమూలంగా తిరస్కరించబడుతున్నాడు. ఇప్పుడు సంబంధం దొరికితే చాలన్నట్టుగా ఉంది అతడి తీరు. మనిషి మంచివాడేగాని అతడికి చెంబెడు చాదస్తం. ముంతెడు మూర్ఖత్వం ఉన్నాయి.

ఈమధ్యే అతడికి కాకినాడ దగ్గర పల్లెటూరునించి సంబంధం వచ్చింది. ఆ పిల్లే మహాలక్ష్మి. అది కుదిరితే అతనితోబాటు మీరూ, నేనూ కూడా అదృష్టవంతులం. ఈ కథని ఇంక విప్పి చెప్పాల్సిన అవసరం ఉండదు.

ooo

మహాలక్ష్మి చక్కగా పాడుతుంది. అందంగా ఉంటుంది. పెద్ద కళ్ళు, తెల్లగా ఒత్తైన వాలుజడ. మంచి కట్నం. కానీ ఆ ఇంట్లో మహాలక్ష్మి తప్ప అందరూ మలేరియా రోగుల్లా కనిపించారు. ఎవరి మొహాన నవ్వు తుళ్లూ లేదు. నిరంతర విచారుల్లా వాళ్ల మొహాలు అనిపించాయి. ఆఫ్రికా కాందిశీకుల్లా ఉన్న వాళ్ల మొహాల్లో జోగినాథం మహాలక్ష్మిని నచ్చిందని ఎప్పుడు చెబుతాడా అన్న

ఆత్మృత కనిపించింది. పెళ్ళి కూతురు లక్షణంగా ఉంది. 'ఈ పెళ్ళి కొడుకు నాకు నచ్చలేదు' అని ఎక్కడ అంటుందో అని జోగినాథం భయం.

ఈ భయాల మధ్య చల్లటి కబురు..సంబంధం ఉభయులకూ నచ్చింది అన్న మాట. అది అందర్నీ ఆనందపరిచింది. లలిత కళలూ, సంగీతం మిగతా విషయాలతో బాటు పెళ్లికూతురు లేటు తాతగారు మంచి గృహవైద్యం చిట్కా వైద్యం సామ్రాట్ అని మహాలక్ష్మి అయన వారసురాలని ఇంట్లో అందరికీ ఆవిడ వైద్యం తప్ప ఇంకొకళ్ల వైద్యం ఒప్పుకోదని తెలిపారు. అయితే కోడలు డాక్టరన్న మాటతో పొంగిపోయింది సుబ్బలక్ష్మి. తనకి ఎన్నో కంప్లైంట్లు. కోడలితో వైద్యం చేయించుకోవచ్చు.

"ఏవమ్మా అల్లోపతియా, ఆయుర్వేదమా" అడిగింది సుబ్బలక్ష్మి కాబోయే కోడలితో.

"లేదత్తయ్యా, మన దొడ్లో ఆకులు, తీగలు, కాయలతో వైద్యం. చూడండి పచ్చ కామెర్లు వస్తాయే దానికి మన దొడ్లో ఒక మొక్క ఉంటుంది. దాని రసం మూడు రోజులు ఇస్తే చాలు. కంట్రోలు అయి పోతుందన్నమాట" వివరించింది మహాలక్ష్మి.

కోడలు వైద్యురాలు కావడం తన కీర్తికి మరో మెట్టుగా భావించింది సుబ్బలక్ష్మి. ఇంక ఊరంతా తన ఇంటి ముందు క్యూ కడతారని సంతోషించింది.

"చూడవమ్మాయి నాకున్న జబ్బేమిటో నువ్వు కనిపెట్టాలి. ప్రొద్దుట లేస్తానా తల తిరుగుతుంది. రెండడుగులు వేస్తానా చెవులు గుయ్యిమంటాయి. సోలెడు కాఫీ తాగి పది ఇడ్లీ తిన్న మరుక్షణం నీరసం ..." సుబ్బలక్ష్మి చెప్పసాగింది. "అదేమైనా కాన్సరా, బ్రెయిన్ ట్యూమరా కనుక్కోమంటే మీ మామగారు కనుక్కోరు"

"ఫరవాలేదు అత్తయ్యా నోరు తెరవండి" ఎప్పుడు లోపలికి వెళ్లి తెచ్చిందో సుబ్బలక్ష్మి నోటిలో పొడరు పడింది. ఏ ఆకుపొడోగాని కటిక చేదు.

"మీ ఆరోగ్యం విషయం నాకు వదిలెయ్యండి అత్తయ్యా" హామీ ఇచ్చింది మహాలక్ష్మి.


శంభుశాస్త్రి సంతోషించాడు. పేరిశాస్త్రి జాలిగా చూశాడు.

ooo

అత్తవారింటికి రావడంతోనే వెనకాల పెరడంతా సర్వే చేసింది మహాలక్ష్మి. "మనకు కావల్సిన ఔషధం మొక్కలన్నీ ఉన్నాయి మామయ్యా" ఆనందంగా చెప్పింది శంభుశాస్త్రితో.

"పోన్లే అమ్మా ఇంకా ఏమైనా మొక్కలు కావాలంటే కడియపులంక వెళ్ళి తెచ్చుకుందాం" శంభుశాస్త్రి భరోసా ఇచ్చాడు.

రెండో రోజు గాజుగ్లాసుల్లో ఆకుపచ్చటి ద్రవాన్ని తెచ్చి అందరికీ ఇచ్చింది మహాలక్ష్మి "ఇది ఆల్ లీవ్స్ జ్యూస్ మామయ్యా. అన్ని రకాల ఆకులు మిక్సీలో వేసి తీసిన రసం. ఇందులో ఔషధ లక్షణాలన్నీ ఉంటాయి. ఇంట్లో అందరూ ప్రొద్దుటే ఒక గ్లాసు తాగాలి. కడుపు



శుభ్రం చేస్తుంది. పైత్యం, వికారాలు దగ్గరకి రావు" వివరంగా చెప్పింది మహాలక్ష్మి.

పెద్దవాళ్లు బలవంతాన తాగారు. పిల్లలు మొరాయించి బలవంతాన తాగారు.

జ్యూస్ తాగగానే సర్వ వికారాలూ ఆరంభమయ్యాయి. మింగలేక కక్కలేక అందరూ అవస్థ పడిపోయారు.

ఆడబడచు శ్రీకాంతి ముగ్గురు పిల్లలు కావ్య, శ్రావ్య, సింధులతో తమ్ముడి పెళ్లి తర్వాత పదిరోజులుందామని ఆగింది.

బాత్‌రూంల దగ్గర పెద్ద పెద్ద క్యూలు ఏర్పడ్డాయి. బలమున్నవాడిదే రాజ్యం క్రింద సింధు అందర్నీ దూసుకుని లోపల దూరడం తలుపేసుకోవడంతో తమ అవసరాలు తీరక కావ్య, శ్రావ్య దానితో దెబ్బలాటలు మొదలుటపెట్టారు.

తొమ్మిది గంటలు దాటి నిద్రలేవని సుబ్బలక్ష్మికి తొమ్మిది లోపు ఆరు విరోచనాలయ్యాయి.

"అవుతాయి. ఫర్వాలేదు. ఆముదం ఆకులు కూడా కలిశాయిగా" అంది మహాలక్ష్మి.

ooo

శంభుశాస్త్రి రుచిగా వంట చేశాడు. సుబ్బలక్ష్మి రెండు ఉద్ధరిణల నీళ్ళు చిలకరించి నైవేద్యం పెట్టింది. వడ్డనలకు సమాయత్తం కాబోతుంటే "ఆగండి" అని మహాలక్ష్మి అర డజను రకాల ఎండు ఆకుల్ని చూర్ణం చేసిన పొడిని తెచ్చి కూరలూ, పచ్చళ్లూ, చారూ అన్నిటిలో కలిపింది.

"చూడండి మామయ్యా! వంకాయ పైత్యం, బెండకాయ శైత్యం, వీటన్నిటి దుర్గుణాలనూ పోగొట్టేదే ఈ చూర్ణం. రోజూ రెండు పూటలా కూరలూ, పచ్చళ్ళూ, చారుల్లో ఇది కలపాలి. లేదా ఆముదంతో తాళింపు పెట్టాలి. ఇది గృహవైద్యంలో ప్రథమ సూక్తి"

పదార్థాలన్నీ పసరు వాసన, దానికి తోడు చారు అదో రకమైన విచిత్ర వాసన. ప్రొద్దుటి పసరుకేమో విపరీతమైన ఆకలి. కానీ తిన్న తర్వాత కడుపులు పట్టుకుని విపరీతంగా ఆయాసంతో అవస్థ పడసాగారు ఇంట్లో వాళ్లంతా. అదో విచిత్రమైన స్థితి. కడుపులో గుడగుడ. కానీ కదలరాని స్థితి.

"కడుపులో గుల్మం, గ్యాసు అంతా పోతుంది" చెప్పింది కొత్త కోడలు. సాయంత్రం ఆరు గంటలకు కొంత కంట్రోలులోకి వచ్చింది.

హడలిపోయిన ఆడపడుచు రెండోనాడే నెమ్మదిగా జారుకుంది పిల్లల్ని తీసుకుని తన ఇంటికి.

పెళ్లిచూపులనాడు నోట్లో వేసిన పొడి చేదు ఎన్నిసార్లు నాలిక గీసుకున్నా నోరు కడుక్కున్నా పోవటం లేదు. దానికితోడు కోడలు ఇచ్చిన జ్యూస్, వంటలో కలిపిన ఎండు చూర్ణాల వాసన... వాటి ద్వారా శరీరంలో ఏర్పడిన మార్పులతో నిస్త్రాణగా పడుకుంది సుబ్బలక్ష్మి.

సుబ్బలక్ష్మిని ఇంకా ప్రేమగా చూసుకోసాగింది మహాలక్ష్మి "ఎలా వుంది అత్తయ్యా" అంటూ.

కంప్లైంట్లు చెప్పడానికి అలవాటుపడిన సుబ్బలక్ష్మి నోటినుంచి పొరబాటున "కాళ్ళు పీకేస్తున్నాయ్ అమ్మాయ్" అని నోరు జారింది.

పెరట్లోకి వెళ్లి నాలుగు చెట్ల వేళ్లు తెంపుకువచ్చింది మహాలక్ష్మి. వాటిని కడిగి, దంచి వేన్నీళ్లలో ఉడికించి ఓ గ్లాసెడు రసం తెచ్చి "ఇది తాగండి అత్తయ్యా" అంది.

"వద్దులే అమ్మాయ్" హడలిపోయింది సుబ్బలక్ష్మి.

"అలా అనకండి అత్తయ్యా. మీ బాధలన్నీ పోగొట్టి, మీ ఒళ్ళు చులాగ్గా చేసి మీ చేత ఇంటిపన్లు హుషారుగా చేయిస్తాను అని మామయ్యతో పందెం కట్టాను. ఇది నా సవాలు" గంభీరంగా అంది మహాలక్ష్మి.



ఇంక వినదని నోరు తెరిచింది సుబ్బలక్ష్మి. కషాయం నోట్లోకి వెళ్ళగానే వివిధ వికారాలతో కడుపులో గడబిడ మొదలయింది సుబ్బలక్ష్మికి. మహాలక్ష్మి ఇచ్చే పసర్లతో సగం సమయం బాత్‌రూమ్‌ల దగ్గర గడపసాగింది సుబ్బలక్ష్మి. ఇంక శంభుశాస్త్రిని సాధించే టైమేది?

పదిహేను రోజులు గడిచేసరికి చిక్కి సగం అయింది సుబ్బలక్ష్మి.

"చూశారా అత్తయ్యా! ఇదీ మందు పని చేస్తోందని చెప్పే తీరు. మరో పదిరోజుల్లో మీరు లేడిపిల్లలా చెంగు చెంగున దూకుతూ ఇంటెడు పనీ చేసుకుంటారు" మహాలక్ష్మి హామీ ఇచ్చింది.

పూర్వంలా కావలసినవన్నీ చేయించుకుని తిని లేనిపోని రోగాలతో అనుమానాల్తో శంభుశాస్త్రిని సతాయించడం కుదరటం లేదు సుబ్బలక్ష్మికి. నోరుజారి ఏ నొప్పి చెప్పినా, మంచం ఎక్కి పడుకున్నా ఏదో పసరు తయారు చేసి నోట్లో పోసేస్తోంది మహాలక్ష్మి. ఆ పసరు వాసనల్తో నాలుక అట్టగట్టుకుపోయి ఏం తిన్నా గడ్డిలా ఉంది సుబ్బలక్ష్మికి.

కోడలు మీద కోపగిద్దామన్నా అత్త ఆరోగ్యం గురించి మహాలక్ష్మి తీసుకుంటున్న శ్రద్ధకు అప్పటికే ఊళ్ళో ఎంతో పేరు వచ్చేసింది. ఏమన్నా అన్నా తన నోరు బయటపడటమే తప్ప ఒరిగేది లేదు.

పేరిశాస్త్రి ఇంట్లో అందరూ అలా ఎందుకు ఉంటున్నారో ఇప్పుడు తెలిసింది శంభుశాస్త్రికి.

మంచిరోజు చూసి హైదరాబాదులో జోగినాథం కాపురం పెడదామని ఆలోచించింది సుబ్బలక్ష్మి.

"మీకు పూర్తిగా నయం అయ్యేదాకా వెళ్లలేను అత్తయ్యా" గోముగా అంది మహాలక్ష్మి.

"లేదమ్మా... కొత్త దంపతులు మీరు. మాకోసం మీ ఆనందాన్ని పాడు చేసుకోకండి. నేను ఆరోగ్యంగానే ఉన్నాను కదా" కోడలు గడ్డం పట్టుకు బ్రతిమాలింది సుబ్బలక్ష్మి.

"అయితే ఈ పూటనుంచి వంట మీరే చెయ్యాలి" గునిసింది మహాలక్ష్మి.

"అలాగేనమ్మా" తెచ్చిపెట్టుకున్న నవ్వుతో వంటచేసింది సుబ్బలక్ష్మి.

"మీరెప్పుడూ ఇలాగే ఉత్సాహంగా పనిచేస్తూ మామయ్యగార్ని సంతోషంగా ఉంచాలి. మీ జబ్బులతో ఎంతో బెంగపడిపోయారాయన. మామయ్యగారూ అత్తయ్య ఎప్పుడైనా దిగులుగా ఉంటే నాకు ఫోన్ చేస్తే నేను వచ్చి అత్తయ్య ఆరోగ్యం చూస్తాను. అలా మాట ఇస్తేనే హైదరాబాదు కాపురానికి వెళతాను" మహాలక్ష్మి కళ్లల్లో అత్త సుబ్బలక్ష్మి మీద ప్రేమ. ఆ ప్రేమకు శంభుశాస్త్రి కళ్లు ఆనందంతో మేఘంలా వర్షించాయి.

"అలాగేనమ్మా మీరు మాత్రం పదికాలాలపాటు 'అత్త సుబ్బలక్ష్మి-కోడలు మహాలక్ష్మి' అని పదిమంది మన్ననలు పొందాలి" శంభుశాస్త్రి ఆనందబాష్పాలు తుడుచుకుని దీవించాడు.

## అంతే మరి!

**ఐటమ్ సాంగ్స్ చేయనని ఆమధ్య ప్రకటించిన బక్కపల్చని భామ త్రిష తన నిర్ణయాన్ని తాత్కాలికంగా మార్చుకుందిట. అదేంటంటారా? ప్రస్తుతం నిర్మాణంలో వున్న రజనీకాంత్ చిత్రం 'కుచేలుడు'లో త్రిష ఓ ఐటమ్ నంబర్ చేయడానికి అంగీకరించింది. ఎంతయినా సూపర్ స్టార్ రజనీ చిత్రం కదా! కాదంటే బాగోదని ఒప్పుకుంది అంటున్నారు ఆమె సన్నిహితులు! అంతేలెండి.**